# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, బెల్జియం దేశాల మధ్య లోతైన సంబంధాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలదే కీలక పాత్ర అని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.
- ❖ రాబోయే పదేళ్లలో ప్రపంచ దేశాలతో రక్షణ భాగస్వామ్యాల కోసం భారత్ వ్యూహాత్మక రోడ్ మ్యాప్ ని సిద్ధం చేసింది.
- ❖ డ్రైవింగ్ లైసెన్సుల విషయంలో గ్రేడెడ్ పాయింట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

=======================

భారత్ - బెల్జియం దేశాల మధ్య లోతైన సంబంధాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్‌తో నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ఈరోజు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రక్షణ సహకారంతో పాటు పునరుత్పాదక ఇంధనం, సైబర్ నేరాలు, దౌత్యపరమైన శిక్షణ రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, ప్రజల మధ్య సంబంధాలు భారత్. బెల్జియంలను సహజ భాగస్వాములుగా మారుస్తున్నాయని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులలో ఒకదానిని రెండు దేశాలు కలిసి అభివృద్ధి చేస్తున్నాయని ప్రధానమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా ఈ రోజు ఉదయం బెల్జియం ప్రధానమంత్రి రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ దౌత్యం భారతదేశ విదేశాంగ విధానంలో ఒక కీలక అంశంగా రక్షణ శాఖ పేర్కొంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో రక్షణ దౌత్యంపై సమగ్ర రక్షా పత్రాన్ని ఈరోజు విడుదల చేశారు. రాబోయే పదేళ్లలో ప్రపంచ దేశాలతో రక్షణ రంగంలో భాగస్వామ్యాల కోసం భారతదేశం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ తో పాటు దార్శనీకతను ఈ రక్షా పత్రం వివరిస్తుందని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ భద్రతా లక్ష్యాలను ప్రపంచ సహకారంతో అనుసంధానంచేస్తూ.. దీర్ఘకాలిక స్థిరత్వం, పరస్పర వృద్ధిని పెంపొందిస్తుందని పేర్కొంది. ద్వైపాక్షిక బహుపాక్షిక భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడం, మిత్ర దేశాలతో ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, స్వదేశీ రక్షణ ఎగుమతులను ప్రోత్సహించడం, సముద్ర భద్రతను బలోపేతం చేయడం వంటివి ఈ రక్షా పత్రంలో కీలకంగా ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశ జీడీపీ 7.8 శాతం వృద్ధిని సాధించడంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం కీలక పాత్ర పోషించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. న్యూఢిల్లీలో `విదేశీ వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏల) వినియోగ ప్రచారం` కార్యక్రమంలో భాగంగా జరిగిన జాతీయ కార్యశాలకు ఆయన ఈరోజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత కొన్ని నెలలుగా భారతదేశం కుదుర్చుకుంటున్న విదేశీ వాణిజ్య ఒప్పందాల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో మూడింట రెండు వంతుల మార్కెట్ వాటాను పొందడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. ప్రపంచంలో ప్రధాన ఎగుమతిదారుగా ఎదగడానికి ఇది దోహదం చేస్తోందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

డ్రైవింగ్ లైసెన్సుల విషయంలో గ్రేడెడ్ పాయింట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ విధానం వల్ల పదే పదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దు చేసేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్` (SIAM) 66వ వార్షిక సదస్సులో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... దీని వల్ల బాధ్యతాయుతమైన డ్రైవర్లు బీమా, ఇతర ప్రోత్సాహకాలను పొందవచ్చని చెప్పారు. ఇదిలా ఉండగా ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆటోమొబైల్ పరిశ్రమగా భారతదేశం ఎదిగే సామర్థ్యం ఉందని కేంద్రమంత్రి అన్నారు. నూతన ఆవిష్కరణల ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం 22.75 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలతో ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ రంగం దేశ జీఎస్టీ వసూళ్లలో దాదాపు 15 శాతం వాటాను అందిస్తోందని చెప్పారు. అలాగే సుమారు 4 కోట్ల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలకు మద్దతు ఇస్తోందన్నారు. 2025-26 సంవత్సరంలో భారతదేశ ఆటోమొబైల్ ఎగుమతులు 24 శాతం పెరిగినట్లు నితిన్ గడ్కరీ తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆటోమేటిక్ డోర్ల సౌకర్యంతో కొత్త తరం సబర్బన్ రైళ్లను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ముంబై (సీఎస్ఎంటీ) నుండి సింధుదుర్గ్ (సావంత్‌వాడి రోడ్) ఎక్స్‌ప్రెస్ రైలును న్యూఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం విధానంలో కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ముంబైలో 18 వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ

పోర్ట్ నుండి దేశంలోని ఇతర ప్రాంతాలకు సరుకు రవాణాను సులభతరం చేస్తామని తెలియజేశారు. తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని గణనీయంగా బలోపేతం చేస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలియచేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లో బ్యాంక్ ఆఫ్ అమెరికా సహకారంతో భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన `ఉన్నత స్థాయి బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం`లో ఆమె మాట్లాడుతూ.. 2026-27 మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని చెప్పారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం మూలధన ఆస్తులను సృష్టించడంపైనా, మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయడం పైన విమానయాన రంగంలో పరిశ్రమలకు మద్దతు ఇవ్వడంపైనా దృష్టి సారించినట్టు మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన సుదీర్ఘకాల సంబంధాలు భారత్, బెల్జియం దేశాల మధ్య ఉన్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో బెల్జియం రక్షణ మంత్రి థియో ఫ్రాంకెన్‌తో కేంద్రమంత్రి ఈరోజు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచం ఈనాడు భౌగోళిక, ఆర్థిక సంక్షోభయాన్ని ఎదుర్కొంటోందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బెల్జియం వంటి ముఖ్యమైన భాగస్వామితో సమావేశం కావడం ఎంతో ప్రయోజనకరమైనదిగా పేర్కొన్నారు. భారత్-బెల్జియం స్నేహాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని బెల్జియం రక్షణ మంత్రి థియో ఫ్రాంకెన్ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. రక్షణ సహకార చర్చలు, ఉన్నత స్థాయి పర్యటనలు, శిక్షణ, సామర్థ్య పెంపుదల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకోవడానికి ఇద్దరు మంత్రులు ఈ చర్చలలో భాగంగా అంగీకరించారు. అదే విధంగా ప్రాంతీయ శాంతి, భద్రతా అంశాలపై కూడా చర్చించారు. ఇండో-పసిఫిక్‌లో సముద్ర భద్రతా సహకారం అవసరాన్ని సైతం ఇరు దేశాల రక్షణ మంత్రులు గుర్తించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్యప్రదేశ్‌లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ... భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రానున్న 24 గంటల్లో బీహార్, తూర్పు రాజస్థాన్, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఇదిలా ఉండగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తర ప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఒడిశా, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వారణాసి పార్లమెంటు నియోజకవర్గంలో వరద పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న్యూఢిల్లీ నుండి సమీక్షించారు. వరదలపై సమగ్ర సమాచారం తెలుసుకోవడానికి జిల్లా మేజిస్ట్రేట్ సత్యేంద్ర కుమార్‌తో ఫోన్ ద్వారా ప్రధానమంత్రి మాట్లాడారు. సహాయక శిబిరాల్లో చేపడుతున్న ఏర్పాట్ల గురించి ప్రధాని ఆరా తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =